వడివడిగా పక్కా ఇళ్ల నిర్మాణం

- జగనన్న లేఅవుట్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన
- నుడాలో చేర్చడం వల్ల 5 వేల ఇళ్లు మంజూరు
- వేగంగా నిర్మాణానికి చర్యలు
- ప్రతినిత్యం పర్యవేక్షిస్తున్న మంత్రి కాకాణి


పొదలకూరులోని జగనన్న లే-అవుట్

పొదలకూరు : మండలంలో పక్కా ఇళ్ల నిర్మాణంలో వేగం పెరుగుతోంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రతినిత్యం ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పర్యవేక్షిస్తున్నారు. గతంలో మండలం నుడా పరిధిలో లేకపోవడం వల్ల ఇళ్ల మంజూరులో జాప్యం జరిగింది. కేవలం పీఎంఏవై కింద మాత్రమే కేంద్ర ప్రభుత్వం నుంచి ఇళ్లు మంజూరు కావడం వల్ల అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోయారు. అయితే ఏడాది క్రితం కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రి అయిన వెంటనే మండలాన్ని నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్(నుడా) పరిధిలోకి తీసుకురావడంతో వేల సంఖ్యలో పక్కా ఇళ్లు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో జగనన్న లే-అవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయి నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. కాలనీల్లో మౌలిక వసతుల కింద ముందుగా బోర్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం నుడా కింద 4,879 ఇళ్లకు సంబంధించి వ్యక్తిగత, జగనన్న లే-అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అంతేకాక అర్హులైన ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే నినాదంతో మంత్రి కాకాణి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో అర్హులను గుర్తించి ఇళ్లను మంజూరు చేయించారు. మండలంలో 162 ఎకరాల్లో రూ.15 కోట్ల నిధులతో 77 జగనన్న లే-అవుట్లను నిర్మించారు.

వేలాదిగా పక్కా ఇళ్ల మంజూరు

మండలానికి ఇళ్లు మంజూరు కావడంలో కొంత జాప్యం జరిగినా వేలాది గృహాలు మంజూరు అయ్యాయి. ఫలితంగా అర్హులైన ప్రతి ఒక్కరూ వ్యక్తిగత స్థలంలో ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారు. నుడా కింద మండలానికి మొత్తం 4,879 ఇళ్లు మంజూరు కాగా ఇందులో బీబీఎల్(బిలో బేస్ లెవల్) 2,991, బీఎల్(బేస్ లెవల్) 121, ఆర్ఎల్(రూఫ్‌లెవల్) 47, ఆర్సీ(రూఫ్‌క్యాస్ట్) 100, కంప్లీట్(పూర్తి) 173, ఎన్ఎస్(నాన్ స్టార్టెడ్) 1,547 ఉన్నాయి. వీటిలో మరో 200 ఇళ్ల నిర్మాణం ఒకటి, రెండు రోజుల్లో మొదలు పెట్టనున్నారు. పీఎంఏవైలో మొత్తం 957 ఇళ్లు మాత్రమే మంజూరు అయ్యాయి. వాటిలో బీబీఎల్ 58, బీఎల్ 74, ఆర్ఎల్ 23, ఆర్సీ 37, పూర్తి 1, ఎన్ఎస్ 764 ఇళ్లు ఉన్నాయి. వీటిలో కూడా మరో రెండు, మూడు మాసాల్లో పూర్తి చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మండలంలో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు 2,127 ఇళ్లను మంత్రి కాకాణి మంజూరు చేయించారు. గడప గడపలో ఇళ్లు కావాలని కోరిన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను కేటాయించారు. మండలంలోనే అతిపెద్ద జగనన్న కాలనీగా గుర్తింపు ఉన్న పొదలకూరులో ఇళ్ల నిర్మాణానికి జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. ఇక్కడ సుమారు 1,400 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు.


జగనన్న లే-అవుట్లో ఏర్పాటు చేస్తున్న బోరు(ఫైల్)

ఇళ్ల నిర్మాణాలను అడ్డుకునే కుట్ర

జగనన్న లే-అవుట్లపై న్యాయస్థానాలను ఆశ్రయించిన టీడీపీ నాయకులు ఇప్పుడు కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను అడ్డుకునే కుట్రకు తెరలేపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల మంజూరులో అవినీతి జరిగిందంటూ పంచాయతీల వారీగా సమాచార హక్కు చట్టం కింద వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే సుమారు 10 పంచాయతీలకు సంబంధించి గృహ నిర్మాణశాఖ ద్వారా వివరాలు రాబట్టేందుకు ఆర్టీఐ కట్టారు. పేదలు ఇళ్లు నిర్మించుకోవడం ఇష్టం లేని వారు ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయితే టీడీపీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని లబ్ధిదారులు అంటున్నారు.

మంచి పరిణామం



జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించి ఇస్తే వెంటనే వెళ్లి గృహ ప్రవేశం చేస్తాం. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు కోసం ఎదురు చూస్తున్నాం. ఇల్లు నిర్మించుకోలేని తమకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి అందజేస్తామనడం మంచిపరిణామం. కూలీనాలీ చేసుకునే మేము అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నాం.

– సీహెచ్ పెంచలమ్మ, పొదలకూరు

నిర్మాణాల వేగం పెంచుతాం



ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచుతాం. మూడు ఆప్షన్ల ద్వారా ఇళ్లను నిర్మిస్తున్నాం. పొదలకూరులో కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లను నిర్మించేందుకు పనులను ప్రారంభించాం. వ్యక్తిగతంగా సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే అర్హులైన ప్రతి వ్యక్తికి ఇల్లును మంజూరు చేస్తున్నాం. ఇందులో తమకు పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా మంజూరు చేస్తున్నాం.

– శివమోహన్, హౌసింగ్ ఏఈ, పొదలకూరు

క్లుప్తంగా

లోకేశ్‌పై పోలీసులకు ఫిర్యాదు


కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న యువత

కోవూరు : టీడీపీ నేత నారా లోకేశ్ తన సభలో అల్లర్లు సృష్టించే విధంగా కార్యకర్తలను రెచ్చగొట్టడంపై కోవూరు, విడవలూరు సోషల్ మీడియా కో-కన్వీనర్లు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎవరిపై ఎక్కువ కేసులు నమోదవుతాయో అలాంటి వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. పార్టీ నేతలు వినయ్ కుమార్, రాకేష్‌రెడ్డి, మసూద్, రవి, హరీస్, వినయ్, వేణు ఉన్నారు.

వ్యక్తిపై కర్రలతో దాడి


గాయపడిన పెంచలరెడ్డి

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామంలో పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని దారికాచి అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై ముగ్గురు కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన యాతం పెంచలరెడ్డి తన తోటకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గంగిరెడ్డి, గంగాధర్, జనార్దన్‌లు పెంచలరెడ్డిని అడ్డగించి వెంట తీసుకొచ్చిన కర్రలతో దాడికి పాల్పడ్డారు. దీంతో పెంచలరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని బాధితుడ్ని పొదలకూరు సీహెచ్‌సీకి తరలించి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన నేతలవి పిచ్చి వ్యాఖ్యలు

కోవూరు : స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై జనసేన నేతలు పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఎస్‌కే రఫీ అన్నారు. ఆయన ఆదివారం కోవూరులో మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా అర్థరహిత విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

3న చండీ హోమం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని ద్రౌపదీ దేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో చండీ హోమాన్ని సెప్టెంబర్ మూడున నిర్వహించనున్నామని దేవస్థాన కమిటీ చైర్మన్ నాగయ్య, అగ్నికుల క్షత్రియ సంఘ జిల్లా చైర్మన్ నగిరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఈఓ దర్గయ్య, పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు, తదితరుల సమక్షంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. దేవస్థానాన్ని పునర్నిర్మించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో చండీ హోమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కమిటీ నిర్వాహకులు ఆరణి వెంకటశేషయ్య, శేఖర్, ధనుంజయ, సుధాకర్‌రెడ్డి, భీమయ్య, పాంచాలి, వెంకటేశ్వర్లు, చిట్టమూరు మురళి, తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దర్గామిట్టలోని రక్షణ సైన్య ప్రార్థన మందిరంలో క్రీస్తు శిలువ టవర్‌ను ఆదివారం పునఃప్రతిష్ఠించారు. చెన్నైకు చెందిన కల్నల్ యాకూబ్ మాసీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టవర్ నిర్మాణానికి రూ.ఆరు లక్షల విరాళాన్ని రాజ్ కిషోర్ అందజేశారని చెప్పారు. అనంతరం యాకూబ్ మాసీని సత్కరించారు. ప్రార్థన మందిర నిర్వాహకులు లూథర్ శామ్యూల్, సాత్వికం, తలారి బాలసుధాకర్, విజయప్రసాద్, చంద్రరాజు, ప్రతాప్, అప్పయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

నెల్లూరు(బారకాసు): మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి చూపును ప్రసాదించొచ్చని మోడరన్ ఐ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ విష్ణుతేజ పేర్కొన్నారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని చిల్డ్రన్స్ పార్కులో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా చేశారు. హాస్పిటల్ కంటి వైద్యుడు కృష్ణమూర్తి, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 19వ వార్డులో 'గడప గడపకు..'

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డు (వవ్వేరు)లో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని, స్థానిక ప్రజలకు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించడంతో పాటు, స్థానిక సమస్యలను తెలుసుకుంటారన్నారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

క్రీడాకారుల పేర్ల నమోదుకు చర్యలు

కొడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్వహించే 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల పేర్ల నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తారన్నారు. వీటిలో పాల్గొనేందుకు 15 సంవత్సరాల వయస్సు పైబడిన బాలబాలికలు అర్హులన్నారు. సచివాలయ స్థాయిలో జట్ల ఎంపిక జరుగుతుందని, ఆ పోటీల్లో గెలుపొందిన వారు మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉండే బాలబాలికలు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఏవైనా సందేహాలుంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శిని సంప్రదించవచ్చని సూచించారు.

పొన్నూరమ్మకు ప్రత్యేక పూజలు


తీర్థప్రసాదాలు వితరణ చేస్తున్న అర్చకుడు


ప్రత్యేకాలంకరణలో పొన్నూరమ్మ

మనుబోలు : మండలంలోని వడ్లపూడి గ్రామదేవత పొన్నూరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఇళ్ల వద్ద నుంచి బోనాలను తలపై పెట్టుకుని ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పొన్నూరమ్మకు ప్రత్యేకాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామానికి చెందిన ఈగ సురేష్-సుభాషిణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అమ్మవారికి సవర బంగారు ఆభరణాలను సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విష్ణాలయంలో ఏకాదశి పూజలు

మనుబోలు మండల కేంద్రంలోని విష్ణాలయంలో ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి సంప్రదాయబద్ధంగా పూజలు జరిపించారు. ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. పచ్చపాల శ్రీనివాసులురెడ్డి-కళ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

దక్షిణాది రాష్ట్రాలకు నిమ్మ ఎగుమతులు

- తోటల్లో తగ్గిన దిగుబడి
- పెరిగిన ధరలు


మార్కెట్‌లో నిమ్మకాయలు

పొదలకూరు: దక్షిణాది రాష్ట్రాలకు నిమ్మ ఎగుమతులు బాగా పెరిగాయి. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల వ్యాపారులు స్థానిక యార్డు నుంచి ధరలు పెంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నిమ్మ కిలో రూ.40 నుంచి రూ.55 పలుకుతోంది. బస్తా కాయలు రూ.5 వేలకు వరకు ధర పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి తగ్గడం వల్ల ఇటీవల కాయలు ధరలు పెరిగాయి. ప్రస్తుతం శ్రావణ మాసంలో వచ్చే అమావాస్య కారణంగా ముఖ్యంగా తమిళనాడు వాసులు విపరీతంగా నిమ్మకాయలను వినియోగిస్తారు. ఫలితంగా చెన్నైకు పొదలకూరు మార్కెట్ నుంచి ఎగుమతులు అధికమయ్యాయి. ఇటీవల వరకు కాయల ధరలు తగ్గిపోయి రైతులు డీలాపడినా ప్రస్తుతం కొంత ఆర్థికంగా నిలదొక్కుకునే పరిస్థితి ఉంది. అయితే నాణ్యతగా ఉన్న కాయలకే ధరలు గిట్టుబాటు అవుతున్నట్లు వ్యాపారులు వెల్లడించారు.

అక్టోబర్ వరకు ఇలాగే..

రైతుల తోటల్లో కాయల దిగుబడి గణనీయంగా తగ్గింది. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటించకుండా చాలామంది రైతులు నిమ్మతోటలను సాగు చేస్తున్నారు. ఫలితంగా సీజన్లతో పనిలేకుండా కొన్ని తోటల్లో కాయలు దిగుబడి తగ్గుతోంది. దీంతో డిమాండ్ పెరిగి ధరలు గిట్టుబాటు అవుతున్నట్లుగా వ్యాపారులు వెల్లడిస్తున్నారు. అక్టోబర్ నెల వరకు కాయల దిగుబడి ఇలాగే ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు తోటలకు నీరు పెట్టకుండా ఎండబెట్టడంతో దిగుబడి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. తరచూ తోటలను ఎండబెడితే పూత శాతం పెరుగుతుందని రైతులు తోటలను ఎండబెడుతున్నారు.

శ్రీకృష్ణ గీతాశ్రమంలో వేడుకలు


ఆశ్రమ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాతలు

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామంలో శ్రీకృష్ణ గీతాశ్రమంలో రజతోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ జీవిత ఆశయం, భగవద్గీత అంశంపై శ్రీపరమానంద స్వామి ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చారు. హనుమాన్ చాలిసా పారాయణం, బాలికలచే కోలాటాలు, ఇస్కాన్ వారిచే హరేరామ హరే కృష్ణ భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో పలు సవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనాథ పిల్లలను చదివించేందుకు గొట్టిప్రోలు రాధారాణి జ్ఞాపకార్థం ఆమె భర్త రామసుబ్బారెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆశ్రమ అభివృద్ధికి పముజుల రామశేషయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్థలాన్ని విరాళంగా ప్రకటించారు. అలాగే గూడూరుకు చెందిన వైద్యులు జనార్ధన్‌రెడ్డి, రోహిణి దంపతులు రూ.లక్ష, గిద్దలూరు సులోచనమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రాధాకృష్ణారెడ్డి రూ.50,116లను విరాళంగా అందజేశారు. గూడూరు వైజేపీ లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఆశ్రమంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. దాతలు గిద్దలూరు కృష్ణారెడ్డి, దేవరం రవీంధర్‌రెడ్డి సహకారంతో నిర్మించిన రేకుల షెడ్డును ప్రారంభించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కుర్చీలు వితరణగా ఇచ్చారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వైజేపీ లయన్స్ క్లబ్ సభ్యులు గోపినాథ్‌రెడ్డి, మనోజ్‌కుమార్, ఆర్వీరావు, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

వెంకటసుబ్బారెడ్డి మృతికి నివాళి


నివాళి అర్పిస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : కోడూరు మేజర్ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కావల్‌రెడ్డి రంగారెడ్డి తండ్రి కావల్‌రెడ్డి వెంకటసుబ్బారెడ్డి అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం కావల్‌రెడ్డి నివాసానికి వచ్చి నివాళి అర్పించారు. అనంతరం రంగారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కావల్‌రెడ్డి రవీంద్రరెడ్డి, సొసైటీ చైర్మన్ కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, పార్టీ నేతలు కావల్‌రెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, కోడూరు దిలీప్‌రెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ


నాగేశ్వరరావును పరామర్శించిన ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : విడవలూరు మాజీ ఎంపీపీ ఓగు నాగేశ్వరరావుకు ఇటీవల గుండె సంబంధిత ఆపరేషన్ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసంలో పరామర్శించారు.

యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఇందుకూరుపేట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, విడవలూరు మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..


ఎంపీ వేమిరెడ్డికి మొక్కను అందజేస్తున్న శ్రీదేవి

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో మహిళా కార్యదర్శిగా ఎన్నికైన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 20వ వార్డు కౌన్సిలర్ చలంచర్ల శ్రీదేవి ఆదివారం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఎంపీ, ఎమ్మెల్యే నివాసంలో కలిసిన ఆమె వారికి మొక్కలను అందజేశారు. అనంతరం శ్రీదేవి మాట్లాడుతూ తనకు జిల్లా కమిటీలో స్థానం కల్పించిన ఎంపీ వేమిరెడ్డికి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట పార్టీ నాయకులు పెంచలయ్య, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రసన్నతో శ్రీదేవి

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : గేదె అడ్డురావడంతో మోటారు బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి వద్ద ఆదివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన కృష్ణమోహన్ పనినిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా గేదె అడ్డురావడంతో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కృష్ణమోహన్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాజానగర్‌లో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్ పీర్లచావిడి వద్ద నెల్లూరుకు చెందిన శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కల్యాణి, చిరంజీవి పాల్గొని పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందజేసి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. ఇక్కడ పరీక్షలు చేయించుకున్న వారికి నెల్లూరులోని తమ వైద్యశాలలో నెల రోజుల పాటు ఉచితంగా ఓపీ ఉంటుందని తెలిపారు. అలాగే మందులు, పరీక్షల్లో రాయితీలు ఉంటాయన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

కొడవలూరు : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను సమతా సైనిక్ దళ్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బండి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సన్మానించారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న విక్టర్ ప్రసాద్‌కు మచిలీపట్నంలో శనివారం రాత్రి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొనేందుకు బండి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో నార్తురాజుపాళెం నుంచి సమతా సైనిక్ దళ్ సభ్యులు వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు.

భగవద్గీత ప్రతుల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో భగవద్గీత ప్రతులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురమౌళీ మాట్లాడుతూ సెప్టెంబర్ 6న వచ్చే కృష్ణాష్టమిని పురస్కరించుకుని వీటిని పంపిణీ చేశామన్నారు.

గ్రూప్ - 2 పరీక్షలపై అవగాహన


బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (టౌన్): మద్రాస్ బస్టాండ్ సెంటర్ సమీపంలోని శ్రీహర్ష కోచింగ్ సెంటర్‌లో గ్రూప్ - 2 పరీక్షలపై నిరుద్యోగులకు అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు సిలబస్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆంధ్రుల చరిత్ర, ఆర్థిక స్థితిగతులపై బుక్‌లెట్‌ను ఉచితంగా అందజేశారు. ప్రొఫెసర్ నలిమి, శ్రీహర్ష కోచింగ్ సెంటర్ డైరెక్టర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'వాత్సల్య' విద్యార్థికి ఐఐటీలో సీటు


చిరంజీవి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కొండాయపాళెంలోని జనహిత వాత్సల్య ఆశ్రమంలో ఉంటూ విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థి చిరంజీవి పోతురాజు భువనేశ్వర్‌లోని ఐఐటీలో సీటు సాధించారు. ఈ మేరకు ఆశ్రమ సెక్రటరీ సాంబశివరావు ఒక ప్రకటనను విడుదల చేశారు. విద్యార్థిని ఆయన అభినందించారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పేకాట కేంద్రంపై పోలీసులు దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వివరాలు.. పెన్నాలో పేకాటాడుతున్నారనే పక్కా సమాచారం నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబీకి అందింది. ఈ క్రమంలో ఆయన పర్యవేక్షణలో సిబ్బంది శనివారం రాత్రి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.23 వేలను స్వాధీనం చేసుకున్నారు.